క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం బుధవారం మండలంలోని ఈతకోట సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు తెలిపారు. ఈతకోట సెక్షన్ పరిధిలో గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరపాడు, లక్ష్మీపోలవరం, పాడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరినగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎన్నికలు సజావుగా జరగాలి



రామరాజులంక పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పోలీసు అబ్జర్వర్ చంద్రకాంత్

మలికిపురం: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎంపీ చంద్రకాంత్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. మలికిపురం, కేశనపల్లి, తూర్పుపాలెం, రామరాజులంక తదితర స్టేషన్లను పరిశీలించి స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది నియామకంతో పాటు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంచాలని కూడా సూచించారు. ఎస్సై సంపత్ కుమార్ ఆయన వెంట ఉన్నారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి

సఖినేటిపల్లి: స్థానిక క్షత్రియ కల్యాణ మండపం ఆవరణలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు పూలమాలలు వేశారు. నాయకులు రుద్రరాజు రంగరాజు, నల్లి ప్రేమానందం, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ఆలమూరు: 216(ఏ) నంబర్ జాతీయ రహదారిలోని మండలంలోని జొన్నాడ వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని తనిఖీ అధికారుల బృందం సీజ్ చేసింది. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం స్టాటిక్ రాజానగరం నుంచి అమలాపురం వైపుగా వెళుతున్న కారులో 180 ఎంఎల్ సామర్థ్యంతో ఉన్న 104 మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు అధికారి కె.నాగేశ్వరరావు గుర్తించారు. వీటి విలువ రూ.15600 ఉంటుందని అంచనా వేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిబంధనలు అతిక్రమించి మద్యం కాని, నగదు కాని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తనిఖీ అధికారుల బృందం హెచ్చరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై శ్రీను నాయక్ తెలియజేశారు.

వైభవంగా రావులమ్మ జాతర

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన రావులమ్మ తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. పూలతో అలంకరించిన గరగతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవికలు సమర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి శివాలయం వరకూ నృత్య కళాకారులు చేపట్టిన గవ్వ నృత్యం భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. గవ్వ నృత్య కళాకారుడికి కోళ్లను నైవేద్యంగా అందించి గ్రామస్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. చర్మ వాయిద్యాల నడుమ కళాకారుడు నృత్యం చేస్తూ భక్తులు సమర్పించిన కోళ్లను నోటితో కొరకడం భక్తుల మనస్సును గగుర్పాటుకు గురి చేసింది. గ్రామం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తమ తమ చంటిపిల్లలతో కాగడాలు వెలిగించి కావిడి కోళ్ల సమర్పించారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. భఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల ఆలయ ఆవరణ అంతా చిత్తడిగా మారింది.

బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట

రాజోలు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం రాజోలు ఎండీ ఆస్పత్రి వీధికి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. 13వ వార్డు సభ్యురాలు మొల్లేటి హైమవతి, మాజీ వార్డు సభ్యుడు మొల్లేటి లక్ష్మణరావు, గుడిమెళ్లంక వీర్రాజు, మొల్లేటి దుర్గ, మొల్లేటి శ్రీనివాస్, మొల్లేటి పెద్దిరాజు, సాయి, మొల్లేటి పల్లపురాజు తదితరులను రాపాక పార్టీలోకి ఆహ్వానించారు. రాపాక మాట్లాడుతూ సీఎం జగన్ బీసీలకు రాజ్యాంగ పరమైన పదవులు కేటాయించి సామాజిక న్యాయం చేశారన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ కొపనాతి పుష్పలత, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, గ్రామశాఖ అధ్యక్షుడు కొప్పాడి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచారం

- రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం మండల గ్రామాల్లో విస్తృత ప్రచారం
- ప్రతిపక్ష పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పాడగట్లపల్లిలో ప్రచార రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి



వానపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: హ్యాట్రిక్ విజయం దిశగా వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామ శివారు జనిపిరెడ్డివారిపాలెం, లక్ష్మీపాలెం ప్రాంతాలు, దేవరపల్లి శివారు చెల్లిరేవు ప్రాంతంలో ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఎన్నికల ప్రచార రథంపై జగ్గిరెడ్డి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పలు చోట్ల కిందకు దిగి స్థానికులను పలకరిస్తూ ఓటు అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిన టీడీపీ నాయకుడు

గ్రామానికి చెందిన కొమ్మర బుల్లి వెంకన్న టీడీపీని వీడి కొత్తపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీకిలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఆత్రేయపురం మండలంలో..

ఆత్రేయపురం: మండలంలోని అంకంపాలెం, నార్కెడ్‌మిల్లి గ్రామాల్లో కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా ప్రతి గడపకు అందించామన్నారు. గత పాలకుల్లా ప్రజలను మోసం చేయకుండా సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించామని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరలా అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజలు హర్షధ్వానాల మధ్య ఆడపడుచులు మంగళ హారతులతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రచారం సాగింది.

గ్రామ గ్రామానా జగ్గిరెడ్డికి జన నీరాజనాలు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, నియోజకవర్గ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డికి ఎన్నికల ప్రచారానికి పార్టీ శ్రేణులే కాకుండా తటస్థ నాయకులు, ప్రజల నుంచి అఖండ ఆదరణ లభిస్తుంది. మంగళవారం రాత్రి మండలంలోని వానపల్లి మెయిన్, శివారు గ్రామాల్లో జగ్గిరెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. అడుగడుగునా ప్రజలు పూలమాలలు, మహిళలు జగ్గిరెడ్డి నుదుట కుంకుమ బొట్లు పెట్టి, హారతులిచ్చారు. ప్రధాన గ్రామాల్లోని రోడ్లలో ప్రచార రథంపై రోడ్ షో నిర్వహించగా, పక్క రోడ్లలో బైక్‌పైన, పాదయాత్ర ద్వారా ప్రజలకు జగ్గిరెడ్డి అభివాదం చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఎక్కడికక్కడ ప్రజలు ముఖ్యంగా పెద్దలు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సాదరంగా స్వాగతించి, సంపూర్ణ మద్దతు తెలిపారు. మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి మద్దతు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద, సామాన్య కుటుంబాలకు వెలుగు వచ్చిందని పార్టీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పాలకులు ప్రజలను నిలువునా మోసం చేశారని, దాంతో ప్రజలు ఓడించి ఇంటికి సాగనంపగా మళ్లీ ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, వానపల్లి పార్టీ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, యువజన విభాగం సభ్యుడు ఇసుకపట్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మని దర్శించుకున్న రాపాక



నూకాలమ్మకు పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: అమలాపురం ఎంపీ అభ్యర్థి, రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు మంగళవారం గూడపల్లిలో వేంచేసిన నూకాలమ్మని దర్శించుకున్నారు. తీర్థమహోత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ సుందర తాతాజీ, నాయకులు దూది సాయిబాబు, కొడవటి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

అంబాజీపేట: వాకలగరువు సచివాలయానికి చెందిన ముగ్గురు వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా ప్రతాలను సచివాలయ కార్యదర్శి డి.నళినికి అందజేశారు. వలంటీర్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు రాజీనామా చేశామన్నారు.

హోం ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ఇంటి నుంచే ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. మండలంలో 40 పోలింగ్ కేంద్రాల పరిధిలో మంగళ, బుధవారాల్లో హోమ్ ఓటును ఎన్నికల సిబ్బంది నిర్వహిస్తారన్నారు. మండలంలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే అధికంగా వైకల్యం ఎక్కువగా ఉన్న వారు 120 మందికి ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. ఇందుకు సంబంధించి బృందాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నియమించారన్నారు. సెక్టార్ అధికారులతో వీఆర్వో, మైక్రో అబ్జర్వర్, పోలీస్ సిబ్బంది ఉంటారన్నారు. హోం ఓటు ప్రక్రియ సక్రమంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నారన్నారు.

సంక్షేమ పథకాలను అడ్డుకున్నారు

పి.గన్నవరం అభ్యర్థి విప్పర్తి

మామిడికుదురు: పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి టీడీపీ అడ్డుకుందని, ఇది దుర్మార్గమైన చర్య అని పి.గన్నవరం నియోజకవర్గం అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకనపాలెం, ఆదుర్రు గ్రామాల్లో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజలను ఇబ్బంది పెట్టడమే టీడీపీ, జనసేన లక్ష్యమని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయన్నారు. ఎవరు ఎంతగా ప్రయత్నించినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ జక్కంపూడి తాతాజీ, పార్టీ నాయకులు కాండ్రేగుల శ్రీనివాస్, భూపతి దామోదరరావు, యాండ్ర వీరబాబు, కుసుమ శ్రీను, పితాని సురేంద్ర, గెడ్డం మహాలక్ష్మమ్మ, చింతా అనంతలక్ష్మి, కుడుపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాకనపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పి.గన్నవరం అభ్యర్థి వేణుగోపాలరావు

నూరు శాతం విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలి



అంబాజీపేటలో హైస్కూల్‌ను పరిశీలిస్తున్న మధుసూదనరావు, సీఎంఓ సుబ్రహ్మణ్యం

అంబాజీపేట: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే నాటికి వంత శాతం విద్యాకానుక కిట్లను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీర వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను మంగళవారం అధికారులు పరిశీలించారు. మధుసుదనరావు, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేసుకుని విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలంలో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు నాలుగు రకాల 21,990 నోట్ పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. వీటిని ఆయా పాఠశాలలకు హెచ్‌ఎంల ద్వారా అందజేస్తారన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే విద్యా కానుక కిట్లను రూమ్‌లలో భద్రపరచి వాటిని పర్యవేక్షించాలని ఎక్కడ ఏ వస్తువు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసే స్కూల్ బ్యాగ్స్, టైలు, షూలు, పుస్తకాలు తదితర సామగ్రిని అన్ని పాఠశాలలకు సరిపడా వస్తాయని వాటిని విపులంగా పరిశీలించి నమోదు చేసుకోవాలని హెచ్‌ఎం కడలి సాయిరాం, సీఆర్ఎంటీ, పీటీఐ టీచర్స్, ఎంఆర్సీ సిబ్బందికి సూచించారు. ఈ ఏడాది జూన్ 12వ తేదీలోగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యాకానుక కిట్లను అందజేసేలా తగిన ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు.

మండలానికి 35 వేల నోటు పుస్తకాలు

పి.గన్నవరం: విద్యాకానుక పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం మండలానికి 35 వేల నోటు పుస్తకాలు వచ్చాయి. వీటిని పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఈ పుస్తకాల నాణ్యతను పరిశీలించేందుకు మంగళవారం ఎస్ఎస్ఏ కార్యాలయం ఏపీసీ ఎ.మధుసూదనరావు, సీఎంఓ బి.సుబ్రహ్మణ్యంలు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి విచ్చేశారు. ఈనేపథ్యంలో నోటు పుస్తకాల పంపిణీ కోసం ఎంఈవో కోన హెలీనా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంఈఓ-2 వీరభద్రం, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందాం

అంబాజీపేట: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకొని జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందామని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, కొర్లపాటి కోటబాబులు అన్నారు. పసుపల్లి, మాచవరం, గంగలకుర్రు, వక్కలంక, కముజువారిలంక తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా విప్పర్తి వేణుగోపాలరావును, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇంటింటికీ తిరుగుతూ బ్యాలెట్ పేపర్‌లను అందించారు.



అంతర్వేదికరలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ఇంటింటికీ జగన్ కోసం సిద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బూత్ స్థాయి కమిటీల సభ్యులు, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని, మళ్లీ జగనన్నను సీఎం చేయండి అంటూ ఇంటింటా ప్రచారం చేశారు. గొందిలో పార్టీ మండల ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగలక్ష్మి, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, అంతర్వేదికరలో నాయకులు దొంగ నాగసత్యనారాయణ, బెల్లంకొండ ఏసు, గెడ్డం అమ్ములు, దూది త్రినాథ్, బూత్ స్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంకలో టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలోకి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో భారీ చేరికలు జరిగాయి. తలారి రాజేష్‌కుమార్, తలారి క్రాంతికుమార్, రాజశేఖర్, సత్యనారాయణ, అలివేలమ్మ, బూసి అరుణ్‌కుమార్, ఐశ్వర్య, తరిట్ల రేవతి తదితరులు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ ఈసారి కూటమి ఓటమి తప్పదని, సార్వత్రిక ఎన్నికల్లో మరలా జెండా ఎగరవేసి ప్రభుత్వాన్ని స్థాపించేది వైఎస్సార్ సీపీనే అన్నారు. ప్రజలకు మంచి చేసే వైఎస్సార్ సీపీ నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలకు కష్టం వస్తే అది తీర్చడానికి ముందు వరుసలో ఉండే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో నడుస్తామన్నారు.



బొబ్బర్లంకలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన ప్రతిపక్ష నాయకులు

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం పెద్దపీట

సఖినేటిపల్లి: రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ రాజోలు మాజీ కో ఆర్డినేటర్ బొంతు రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం సఖినేటిపల్లిలో ఆటో యూనియన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ, డ్రైవర్లను ఆదుకుని, వారి కష్టాలకు భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌నే అని తెలిపారు. జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుంటేనే అన్ని పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లిలో ఆటో యూనియన్ నాయకులతో సమావేశమైన రాజేశ్వరరావు

టీడీపీకి ఓటేస్తే భవిష్యత్ అంధకారమే

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గిరిజనుల అభివృద్ధి, పిల్లల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడ్డాయని గిరిజన సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదుర్రులో పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావును మంగళవారం సంఘాల ప్రతినిధులు కలిసి మద్దతు తెలిపారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, ఎరుకుల ఆత్మ గౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రామకృష్ణ, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడమల రామచంద్రయ్య మాట్లాడుతూ చంద్రబాబు చెప్పే అబద్ధపు వాగ్దానాలు, మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావును గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీకి మద్దతు పలికిన గిరిజన సంఘాలు

రావులపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీకి మద్దతుగా గిరిజన రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని కలిసి గిరిజన సంఘాల నాయకులు మద్దతు పలికారు. చంద్రబాబు మాటలు విని మీరు టీడీపీకి ఓట్లు వేస్తే మన భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. గిరిజనులకు అండగా ఉన్న జగన్‌నే మళ్లీ ఎన్నుకోవాలన్నారు. నిత్యం అందుబాటులో ఉండే కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

ఆలమూరు: మండు వేసవిలో కురిసిన అతి భారీ వర్షం, ఈదురుగాలుల వల్ల జనజీవనం స్తంభించింది. ఏకధాటిగా సుమారు మూడు గంటల పాటు కురిసిన వర్షం అంతటా బీభత్సం సృష్టించింది. రహదారుల వెంబడి చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి పొద్దుపోయే వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇటుక బట్టీల కళ్లాల మీద ఉన్న ఇటుక తడిసి ముద్దవడంతో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే రబీలో పండించిన ధాన్యాన్ని తేమ తగ్గించుకునేందుకు అరుబయట ఆరబెట్టుకున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధాన్యం రాశుల్లోకి వర్షపు నీరు వెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. పలు చోట్ల కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఈదురుగాలులకు షాపుల వద్ద హోర్డింగ్‌లో ఎగిరిపోయాయి. ఇదిలా ఉండగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కాస్త సేదతీరారు.



కె.పెదపూడిలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

అంబాజీపేటలో..

అంబాజీపేట: అకాల వర్షం అన్నదాతలను, ప్రజలను కలవరపరుస్తోంది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కారుచీకటి మబ్బులతో దర్శనమిచ్చి ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోవడంతో గత రెండు వారాలుగా అధిక ఉష్ణోగ్రతలతో, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు ఒక్కసారిగా సేద తీరారు. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో గంగలకుర్రు, మొసలపల్లి, ముక్కామల, కె.పెదపూడి, ఇసుకపూడి, చిరతపూడి తదితర గ్రామాల్లో ధాన్యం ఆరబెట్టుకున్న రైతులు వాటిని సంరక్షించుకునేందుకు పరుగులు తీశారు. ధాన్యం రాశులపై బరకాలను కప్పి సంరక్షించుకున్నారు. మరి కొందరు ధాన్యం బస్తాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. అకాల వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో విరిగిపడిన చెట్లు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: వాతావరణంలో వచ్చిన మార్పులతో మంగళవారం మధ్యాహ్నం రావులపాలెంలో కురిసిన భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. వీధులు జలమయం కావడంతో పాటు పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో నిండాయి. అయితే భారీగా వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ లైన్లపై చెట్లు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే రాత్రి వరకు విద్యుత్ అధికారులు సరఫరాను పునరుద్ధరించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.